# భయ కారణం

**కథానిక**

ఎమ్. పార్థసారథి

మురళి అదృష్ట వంతుడు. అతడి జీతం ఎంతో చెబితే మీరు తప్పక అసూయ పడతారు. అంతే కాదు, 'పెర్క్స్' చాలా వున్నాయి వుద్యోగంలో. ఫ్రీ క్వార్టర్స్, ఫ్రీ మెడికల్ ఎయిడ్. రెండేళ్ల కోసారి విలాస పర్యటన. ప్రావిడెంట్ ఫండ్, చీటికీ మాటికీ అడ్వాన్సులు, అలవెన్సులు, అనేక రకాల సెలవులు. చకచకా ప్రమోషన్లు. ఉద్యోగం చెయ్యాలనుకున్న వాడికి యింత కన్నా యింకా ఏం కావాలి?

సరే, అతడికి పని ఎంత టైట్‌గా, వూపిరి సలపకుండా వుంటుందో అని గనక మీరనుకుంటే, అది మీ పొరపాటు. ఆఫీసులో వర్క్ 'ప్రాసెస్' చెయ్యటానికి వాళ్లకు కొన్ని మాన్యువల్స్. నిర్దేశ సూత్రాలూ వున్నాయి. వాటి ప్రకారం కళ్లు మూసుకొని పని చెయ్యాలి. చెయ్యాల్సిన ఏడుగంటల డ్యూటీలో రెండు గంటలు కూడా అతడు సరిగ్గా పనిచెయ్యడంటే మీకు ఎబ్బెట్టుగా కనిపించొచ్చు గాని అతిశయోక్తి కాదు. అవునంటే, వాళ్లాఫీసులో పన్లేదు. రోజంతా కబుర్లు, కాఫీలు, పత్రికలూ, పుస్తకాలు, కళాపోషణ, గేమ్స్, జర్నలిజం, నాటకాలు, ఫ్రీ స్టేషనరీ, ఫ్రీ టెలిఫోన్, ఫ్రీ టైపు రైటర్, స్టేటస్. ఇన్‌ఫ్లుయన్స్ – ఇది ఆఫీసు.

మురళి విద్యాసంపన్నుడు.

ఎమ్మెస్సీ పాసయ్యాడు. కాని పదేళ్ల వుద్యోగం తర్వాత చదువు కున్నదంతా మర్చిపోయాడు. ఇంటర్వ్యూలకు వెళ్లక్కర్లేదు గనక జనరల్ నాలెడ్జి యిప్పుడతడికనవసరం. కాంపిటేటివ్ స్పిరిట్ ఎప్పుడో పోయింది. దిన పత్రికలు చూసేది సినిమాలు అడ్వర్టజుమెంట్ల కోసం. ఆఫీసు కరెస్పాండెన్సులో చాలా మట్టుకు 'ఫారమ్స్' వుంటాయి. వాటిలో ఖాళీలు పూర్తి చెయ్యటం, అవసరమైన వాటికి టిక్కులు పెట్టటం, మిగతావి కొట్టెయ్యటం అతడి పని – ఇంగ్లీషు కాంపోజీషన్ యింకా జ్ఞాపకముందా? లెక్కలు చెయ్యటానికి మెషీన్లున్నాయి. అతడు డిస్పాచ్ సెక్షన్‌లో చాలాకాలంగా కవర్ల మీద అడ్రసులు రాస్తున్నాడు.

మురళి భయస్తుడు.

అతడిలా కావటానికి అతడికున్న బ్రహ్మాండమైన వూహా శక్తి కూడా కొంత కారణం. ఉద్యోగం పోతే ఎలా అనుకుంటాడు. ఇలా, తీరిగ్గా కూర్చోబెట్టి నెలకు పదిహేను వందలెవరిస్తారు? బద్ధకం పెరిగింది. పుస్తకజ్ఞానం, లౌకిక జ్ఞానం తరిగింది. 'పోటీ' మనస్తత్వం ఎప్పుడో పోయింది. ఖర్చులూ, విలాసాలూ, అశక్తతా పెరిగాయి. తను ఆఫీసులో చేస్తున్న పని సెకండుఫాం చదువుకున్న కుర్రాడెవడైనా చెయ్యవచ్చు. తన కింత జీతం రావటం కేవలం యాక్సిడెంట్. అర్హతను బట్టి కాదు. ఏ కారణం చేతైనా ఈ వుద్యోగం పోతే తనేం చెయ్యగలడు? శరీర శ్రమ చెయ్యలేడు. మరే నైపుణ్యమూ తనకు లేదు. ఎయిర్ కండిషన్డ్ ఆఫీసు అలవాటైంది. ఎండలో పని చెయ్యలేడు. క్వార్టర్స్ విశాలంగా వున్నాయి. ఇరుగ్గదుల్లో యిప్పుడుండ లేడు. ఆఫీసు

డిస్పెన్సరీలో మంచి మంచి ఖరీదైన మందు లిస్తారు. తనవన్నీ కొనుక్కో లేడు.

ఈ వుద్యోగం పోతే బైట ప్రపం చంలో పైసాకు గూడా మారడు. అందుకే ఇంత భయం. తనకూ అభి ప్రాయాలున్నాయి. కాని పైకి చెప్ప లేడు. ఆఫీసర్ల మీద కోపమొస్తుంది. పైకి చూపించ లేడు. ఉద్యోగపు నిబంధనల నతిక్రమించి ఏంచెయ్యా లన్నా భయం. అర్హత లేని సుఖం మరిగితే మరెలాగుంటుంది? అద్దాల మేడ అందంగానే వుంది. కాని ఏ క్షణాన ఎవరు రాయేస్తారోనని భయం. అందుకే ఊపిరి బిగబట్టి, అడుగు తీసి అడుగు వేస్తూ ఒదిగి ఒదిగి నడుస్తున్నాడు. ఎప్పుడు కల చెదిరి పోతుందో నని భయం.

నిరుద్యోగ సమస్య ఇంత విపరీతంగా వున్న ఈ రోజుల్లో, జీవితానికి భద్రత లేని ఈ కాలంలో, పొట్ట గడవడమే అదృష్ట మనుకుంటున్న ఈ సమాజంలో ఈ సుఖభోగం ఎలా వరించింది? తన కన్నా తెలివైన వాళ్లు, ఎక్కువ అర్హత లున్న వాళ్లు, తనకన్నా తక్కువ జీతాలు తెచ్చుకుంటున్నారు. తనకన్నా బల మైన వాళ్లు రోజంతా కాయకష్టం చేసీ సగం కడుపుకే తింటున్నారు. అర్హత లున్న వాడు భయపడడు. ఇదికాక పోతే మరో పనిచేసి బ్రతుకుతా నను కుంటాడు. కాని తను వుద్యోగం లాట రీలో గెలిచాడు. ఈ సుఖం, ఈ జీతం యాక్సిడెంట్. షీర్ ఆక్సిడెంట్.

అదీ భయ కారణం.

# నెత్తుటి సూర్యోదయాలు

దస్తగిర్

నగరం చీకటి ఒడ్డును ఒరుసుకుంటూ
నా అడుగులు వేగంగా
ప్రవహిస్తున్నప్పుడు
ఇళ్ళ సమాధుల నుండి వినవస్తున్నాయ్
ఏడ్పుల వెక్కిళ్ళు.
అవయవాలు మొలిచిన
మాంస ఖండాల నుండి
చౌకబారు సెంటు వాసనలు.
త్రాచుల్లా కాళ్ళను కాటేస్తున్నాయ్.
దుకాణాల్లో కంటే ఇక్కడ మాంసం
చాలా చౌక!
చుట్టూ దాహం కళ్ళతో నెత్తురు తాగి
వెళ్ళిన
తోడేళ్ళ అడుగు జాడలు.

చౌరాస్తా కాష్టంపై నాగరికత
శవంలా కాలుతున్న కమురు వాసన!
ఆవలి ఒడ్డున ..
కార్ఖానాల గేట్ల ముందు
పెదాలపై నినాదాల్ని పగడాల్లా
పడవేస్తూ బారులుగా చెమటోడ్చే వాళ్ళు
చెలరేగినపుడు-
వాళ్ళ బ్రతుకుల్లో ఉదయిస్తున్న
ఎన్నెన్నో నెత్తుటి సూర్యోదయాల్ని
ఇక్కడి పాలిపోయిన మొఖాలు
ఆశగా చూస్తున్నాయ్!!